క్లుప్తంగా

నవాబుపేటలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు



వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బంది

కలకడ : ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో అందించే ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలోని నవాబుపేట పంచాయతీలో 104లో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు అందించారు. 95 మందికి సాధారణ చికిత్సలు, మందులు పంపిణీ చేశారు. 18 మంది గర్భవతులకు చికిత్సలు చేసి, వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. బాలింతలకు, చక్కరవ్యాధి గ్రస్తులకు, బీపీ ఉన్న వారికి చెకప్ చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్ సుబ్బరత్న, ముజీబ్, ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎస్‌డీజీ సర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఆనంద్‌కుమార్

తంబళ్లపల్లె : మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ఎస్‌డీజీ (సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్) సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సర్వే సక్రమంగా చేయాలని ఎంపీడీవో ఆనంద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమగ్ర సమాచారాన్ని సేకరించి సర్వే పూర్తి చేయాలన్నారు.

మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు



గ్రామంలో సమస్యలు తెలుసుకుంటున్న సింగిల్‌విండో అధ్యక్షుడు, ఎంపీడీఓ

కలకడ : వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని మంచినీటి సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని సింగిల్‌విండో అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, ఎంపీడీఓ నారాయణ అన్నారు. మంగళవారం మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ ఇర్రివాండ్లపల్లె, నాయునివారిపల్లె గ్రామాలలో వారు పర్యటించి గ్రామాలలో ఉన్న సమస్యలు తెలుసుకుని, పరిష్కార మార్గాలను చూపారు. హౌసింగ్ దరఖాస్తుల సేకరణ, నీటి సమస్యలు, పరిశుభ్రత వంటివి నమోదు చేసి, త్వరలో పరిష్కరించి, అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నందిని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఐఓ ఉషశ్రీ

కలికిరి : చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి (డీఐఓ) డాక్టర్ ఉషశ్రీ అన్నారు. మండలంలోని మేడికుర్తి పీహెచ్‌సీని ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాధి నిరోధక టీకాలు, మాతా శిశుమరణాల నివారణపై ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. గర్భవతులు ప్రతి నెలా ప్రభుత్వాసుపత్రిలో వైద్య సదుపాయం పొందేలా చూడాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీలోని ఇమ్యునైజేషన్ రికార్డులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి చిన్నరెడ్డెప్ప, డాక్టర్ కావ్యగంధ, సీహెచ్ఓ నారాయణ, హెచ్ఎస్ హేమలత, ఇందిరాదేవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యకార్మికుల సేవలు వెలకట్టలేనివి



కార్మికులకు వస్తువులు అందజేస్తున్న సింగిల్‌విండో అధ్యక్షుడు, ఎంపీడీఓ

కలకడ : గ్రామాల పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని సింగిల్‌విండో అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, ఎంపీడీఓ నారాయణ అన్నారు. మంగళవారం కలకడ సర్పంచ్ ప్యారీజాన్ ఆధ్వర్యంలో కలకడ సచివాలయం పరిధిలోని పారిశుధ్య కార్మికులకు యూనిఫాం, సబ్బులు, ఆయిల్, షూ వంటివి అందజేసి వారికి ఆరోగ్యసూత్రాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజంపేట పార్లమెంటరీ కార్యదర్శి షావత్అలీఖాన్, పంచాయతీ కార్యదర్శి నందిని, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులు

- సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం
- రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి





ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొంటున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఆర్బీకేలో కియోస్కో యంత్రం పరిశీలిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి

గుర్రంకొండ : జిల్లాలోని ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల అభివృద్ధి నిధులు మంజూరు చేస్తామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్లుట్ల పంచాయతీలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డితో కలసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన పలు సమస్యలపై స్పందించి అప్పటికప్పుడు పరిష్కారం చూపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులను తీసుకొచ్చి ప్రజల సమస్యలను వారి ఇళ్ల వద్ద పరిష్కరిస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు, వైఎస్సార్ ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని అన్నారు. గతంలో జన్మభూమి కమిటీ సభ్యులు ఇష్టానుసారంగా లబ్ధిదారుల ఎంపిక చేసేవారన్నారు. గత టీడీపీ హయాంలో ప్రభుత్వ పథకాలు కొంత మందికే అందేవన్నారు. ప్రస్తుతం అలాంటి పద్ధతికి స్వస్తి పలికిన ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రతిపక్షాల వారు పని గట్టుకుని విమర్శలు చేయడం తప్ప వారి హయాంలో ఒక్క సంక్షేమ పథకమైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. జగనన్న చేస్తున్న మంచి పనులు శాశ్వతంగా ప్రజల గుండెల్లో నిలిచిపోతాయన్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకొని జగనన్నను మరోసారి ఆశీర్వదించాలన్నారు.

ఎల్లుట్ల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో నెలకొన్న సమస్యలన్ని పరిష్కరిస్తామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఎల్లుట్ల పంచాయతీ పరిధిలోని శీలంవారిపల్లె, ఇ.పసలవాండ్లపల్లె, కల్లూరివాండ్లపల్లె గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయని మహిళలు వారి దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో కొత్తబోర్లు వేసి పైపులైన్లు ఏర్పాటు చేసి, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఇందుకోసం రూ.6 లక్షలు మంజురు చేస్తామన్నారు. నల్లగుట్ట దళితవాడలో శ్రీ రామస్వామి ఆలయ నిర్మాణానికి రూ.75 వేలు, నల్లగుట్ట పల్లెలో శ్రీ అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష మంజురు చేశామన్నారు. కల్లూరివాండ్లపల్లెలో కల్వర్టుల నిర్మాణానికి రూ. 60 వేలు సొంత నిధులు ఇస్తామన్నారు. వీటితోపాటు పంచాయతీ పరిధిలో నెలకొన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

ఆర్బీకేలు.. సీఎం మానసపుత్రికలు

రైతు భరోసా కేంద్రాలు ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న మానసపుత్రికలు అని రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. ఎల్లుట్లలోని ఆర్బీకేను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కియోస్కో యంత్రాన్ని పరిశీలించారు. వ్యవసాయ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చిత్రాలను పరిశీలించారు. రైతులకు ఎలాంటి రకాల విత్తనాలు, ఎరువులు ఇస్తున్నారో ఎంపీఈఓ రిజ్వానాను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కియోస్కో యంత్రం ద్వారా రైతులు ఎరువుల కొనుగోలు, డబ్బులు చెల్లింపులు చేపట్టవచ్చన్నారు. తమ సొంత గ్రామాల నుంచే వారికి కావాల్సిన ఎరువులను తీసుకోవచ్చన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్, రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం గౌరవాధ్యక్షులు నారదరెడ్డి, జెడ్పీటీసీ సమ్రీన్ ముక్తియార్, మండల సచివాలయాల కన్వీనర్ చింతిర్ల నాగేంద్ర, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు కందుల గుణశేఖర్, అప్పల్ల, ఎల్వీ రమణ, మాజీ ఎంపీపీలు నక్కాచంద్రశేఖర్, జమీర్ ఆలీఖాన్, వైస్ ఎంపీపీ కరుణాకర్, సర్పంచ్‌లు విశ్వనాథ్, మస్తాన్‌రెడ్డి, సింగంశెట్టి రెడ్డికుమార్, జగన్మోహన్, ఎంపీటీసీలు రాజగోపాల్, ఖదీర్ పాల్గొన్నారు.

నాడు బాబు టోకరా... నేడు జగనన్న ఆసరా





ఆసరా కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు, చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట : వైఎస్సార్ ఆసరా మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని ఇస్తుందని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మంగళవారం కురబలకోట మండలం చేనేతనగర్‌లోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మూడవ విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అక్కచెల్లెమ్మల ఆర్థిక వికాసం, పేదరిక నిర్మూలనే ధ్యేయంగా సీఎం జగన్ పని చేస్తున్నారన్నారు. మహిళలు సాధికారిత సాధించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఉన్నన్ని పథకాలు దేశంలో మరే రాష్ట్రంలో లేవన్నారు. ఆసరా నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో చంద్రబాబు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని రాష్ట్ర మహిళలను నిలువునా మోసం చేశాడన్నారు. ఆఖర్లో ఓట్ల కోసం పసుపు-కుంకుమ పేరుతో రూ.పది వేలు విదిల్చి చేతులు దులుపుకొన్నాడన్నారు. అదే జగన్ పాదయాత్రలో చెప్పిన మాటకు కట్టుబడి డ్వాక్రా రుణమాఫీ చేస్తున్నారన్నారు. చంద్రబాబుకు, ఆయన కుమారుడు లోకేష్‌కు రాజకీయంగా పుట్టగతులు లేకుండా చేయాలన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో రూ.10 వేల కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ముదివేడు రిజర్వాయర్ నిర్మాణం, తంబళ్లపల్లె మల్లయ్యకొండ అభివృద్ధితోపాటు మారుమూల గ్రామాలకు కూడా తారు రోడ్లు వేయడం జరిగిందన్నారు. అయినా ఇంకా ఎంతో చేయాలన్న తపన వెంటాడుతోందన్నారు. మాకు రాజకీయం కన్నా మనుషులకు మేలు చేయడం, వారి సమస్యలు పరిష్కరించడం ముఖ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో మహిళలంతా జగనన్నను మనస్ఫూర్తిగా ఆదరించాలన్నారు. అనంతరం మండలంలో 828 డ్వాక్రా గ్రూపులకు 9108 మంది సభ్యులకు రూ.7.86 కోట్ల ఆసరా చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం డైరెక్టర్ మిట్టపల్లె భాస్కర్‌రెడ్డి, బైసాని చంద్రశేఖరెడ్డి, బి.దస్తగిరి, పోరెడ్డి విశ్వారెడ్డి, సురేంద్రనాథ్, డీఆర్ ఉమాపతిరెడ్డి, ఎన్వీ రమణారెడ్డి, సురేంద్ర, ఆర్సీ ఈశ్వర్‌రెడ్డి, ఏపీఎం నీరజతోపాటు వివిధ మండలాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ



మదనపల్లె : అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మదనపల్లె : అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలు జరగవని అగ్నిమాపక అధికారి మాబుసుబాన్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన మంగళవారం బసినికొండ ఇండియన్ ఆయిల్ పెట్రోల్‌బంక్‌లో సిబ్బందికి, యాజమాన్యానికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాల నివారణలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రదర్శనలతో తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణకు సంబంధించి అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ముద్రించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది పురుషోత్తంనాయుడు, మురళీమోహన్‌నాయక్, విజయ్‌కుమార్, ఇమ్రాన్‌బాషా పాల్గొన్నారు.

పీలేరు : పెట్రోల్ బంకులలో అగ్నిప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక కేంద్రం అధికారి సుబ్బరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక సీవీరెడ్డి పెట్రోల్ బంకు వద్ద అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌ఫోన్ వాడకంతో పెట్రోల్ బంకుల్లో ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా మంటలు అదుపు చేయాలో డెమో చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్యాంప్రకాష్, నాగిరెడ్డి, హేమాద్రిరెడ్డి, కృష్ణమూర్తి, శ్రీనివాసులు, వెంకటేష్, వెంకటరమణ, రెడ్డిశేఖర్, షఫీ, సకీల్‌నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాలను అరికట్టవచ్చునని ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి సుబ్బరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, సిబ్బందికి అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఫైరోజా బేగం, డాక్టర్ హర్షిత రెడ్డి, సిబ్బంది బాబయ్య, శ్రీనివాసులు, కిరణ్‌కుమార్, రవి, చైతన్య, ఇమ్రాన్, భాస్కర్, రెడ్డి శేఖర్, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువు : ప్రమాదాల నివారణకు మెలకువలు అవసరమని ఫైర్ అధికారి క్రిష్ణయ్య అన్నారు. స్థానిక పెట్రోల్ బంక్‌లో సిబ్బందికి అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డెమో రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్‌బంక్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

డ్రోన్లతో జగనన్న లేఔట్ల ఫొటోలు

పెద్దతిప్పసముద్రం : అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జగనన్న లేఔట్లలో నిర్మించిన గృహాలకు డ్రోన్ల ద్వారా ఫొటోలు, వీడియోలు తీస్తున్నామని హౌసింగ్ డీఈ శ్రీహరి అన్నారు. మంగళవారం మండలంలోని విసనకర్రవాండ్లపల్లి, రంగసముద్రం, పెద్దతిప్పసముద్రం గ్రామాల్లోని లేఔట్లలో 15కు పైగా గృహ నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను డ్రోన్ ద్వారా ఫొటోలు తీసి ప్రభుత్వ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. ఆయన వెంట ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగార్జున ఉన్నారు.

ఆర్టీసీ యాత్ర బస్సులు వినియోగించుకోండి

పీలేరు రూరల్ : ఆర్టీసీ స్పెషల్ యాత్ర బస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీలేరు డిపో మేనేజర్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వివిధ ప్రాంతాల ఆధ్యాత్మిక కేంద్రాలకు, విజ్ఞాన కేంద్రాలకు, శుభకార్యాలకు అనువుగా ఆర్టీసీ సర్వీసులను అద్దెకు పంపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులను, యాత్రికులను ఆర్టీసీ సురక్షితంగా, బాధ్యతగా గమ్యానికి చేర్చుతుందని చెప్పారు. భద్రాచలం, అరుణాచలం తదితర ప్రాంతాలకు స్పెషల్ యాత్ర సర్వీసులు నడుపుతున్నామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ మార్కెటింగ్ టీమ్ సభ్యులు గండికోట ప్రమీల, కల్లూరి రమణ పాల్గొన్నారు.

ఖాదర్‌బాషాకు పురస్కారం

పీలేరు రూరల్ : పీలేరు పట్టణానికి చెందిన అంతర్జాతీయ బహుభాషా రంగస్థలం, బుల్లితెర, వెండితెర కళాకారుడు ఖాదర్‌బాషాకు రంజాన్ పురస్కారం లభించింది. మంగళవారం తిరుపతి జిల్లా రేణిగుంటలో ఎంఏ జబ్బార్ ట్రస్ట్ నిర్వాహకులు షేక్ ఫరీద్ బాబా రంజాన్ పురష్కారాలు అందజేశారు. ఇందులో భాగంగా ఖాదర్‌బాషాను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఏ-1 క్యాటరింగ్ నిర్వాహకులు షేక్‌మస్తాన్‌తోపాటు శేఖర్, మధు, వాసు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే దళితులకు సముచిత స్థానం



ఎస్డీడీ హరి

కలికిరి : వైఎస్సార్‌సీపీలోనే దళితులకు సముచిత స్థానం లభిస్తోందని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్డీడీ హరి అన్నారు. మంగళవారం కలికిరిలో ఆయన మాట్లాడుతూ దళితులుగా ఎవరు పుట్టాలని కోరుకుంటారని మాజీ సీఎం చంద్రబాబు, దళితులు ఏం పీకారని ఆయన పుత్రరత్నం లోకేష్ నాటి నుంచి చెరోవైపు దళితులను కించపరుస్తూనే ఉన్నారని గుర్తుచేశారు. దళితుల గురించే మాట్లాడటానికే ఇష్టపడని వారు పార్టీలో దళితులను ఎలా గౌరవిస్తారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దళితులను అన్ని విధాలుగా నవరత్నాలు పథకాలతో ఆదుకుంటోందని, అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చుతోందన్నారు.

ఆధార్‌కార్డు అప్‌డేట్ చేయించాలి



ఆధార్ అప్‌డేట్ సెంటర్‌ను ప్రారంభించిన ఎంపీపీ

మదనపల్లె : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, పౌరసేవలు పొందాలంటే ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి అని ఎంపీపీ రెడ్డెమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని సీటీఎం జెడ్పీహైస్కూల్‌లో సర్పంచ్ ఆనందపార్థసారధితో కలిసి ఆధార్ అప్‌డేట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 2015 కంటే ముందు ఆధార్ పొంది అప్‌డేట్ చేయని వారు వెంటనే చేయించుకోవాలన్నారు. 6 ఏళ్లు కలిగిన పిల్లలు ప్రతి ఒక్కరికీ ఆధార్‌కార్డు ఉండాలని, 15 ఏళ్లలోపు పిల్లలకు ఆధార్ అప్‌డేట్ పూర్తి ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగుచంద్ర, సింగిల్‌విండో డైరెక్టర్ వీరప్రతాప్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'మా ఆనందానికి అవధుల్లేవు'



విధుల్లో చేరిన 1998 డీఎస్సీ ఉపాధ్యాయులు

పెద్దతిప్పసముద్రం : 1998 డీఎస్సీ మొదటి జాబితాలో ఎంపికైన వారిలో ఐదుగురికి మండలంలోని ప్రభుత్వ స్కూళ్లలో పని చేసేలా ఉత్తర్వులు అందాయని ఎంఈఓ నారాయణ మంగళవారం పేర్కొన్నారు. వీరిలో బీ.రమణయ్యకు మండలంలోని టి.సదుం పంచాయతీ రామాపురం పాఠశాలలో, శేషనయన్ రాపూరివాండ్లపల్లి పంచాయతీ ఉప్పరవాండ్లపల్లి, నరసింహులుకు మడుమూరు, కే.శీనప్పకు బొమ్మకపల్లి, కె.రమణయ్యకు కమ్మచెరువు పంచాయతీ మొరుసుపల్లి ప్రాథమిక పాఠశాలలో టీచర్‌గా పోస్టింగ్ వచ్చినట్లు ఎంఈఓ వెల్లడించారు. ఈ సందర్భంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు మొండిచేయి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండో విడతలో క్వాలిఫై అయిన వారికి ఉద్యోగాలివ్వడంతో అప్పట్లో ఈ సమస్య వివాదాస్పదంగా మారి కోర్టు వరకు వెళ్లిందన్నారు. ఉద్యోగం వస్తుందిలే అని కొన్నేళ్లపాటు కళ్లకు ఒత్తులు వేసుకుని ఎదురు చూసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఇక వయసు మీద పడటంతో కుటుంబ సభ్యులు పెళ్లి చేయడంతో సంసార బాధ్యతలు అధికం కావడం వల్ల తమకు చేతనైన పని చేస్తూ అరకొర జీతాలతో నెట్టుకొస్తున్నామన్నారు. ఇలాంటి తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తమ చిరకాల కోరిక నెరవేరిందని సంతోషించారు. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



మదనపల్లె : సీటీఎంలో కరపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, సర్పంచ్



12వ వార్డులో కరపత్రాలు చూపుతున్న వైస్ చైర్మన్ జింకా చలపతి

మదనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హత ప్రామాణికంగా ఇంటివద్దకే సంక్షేమ పథకాలు అందుతుండటంతో ప్రజలందరూ మళ్లీ సీఎంగా జగనన్నే రావాలని కోరుకుంటున్నారని ఎంపీపీ రెడ్డెమ్మ, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి తెలిపారు. మంగళవారం మండలంలోని సీటీఎం పంచాయతీ, మున్సిపాలిటీలోని 12వవార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ గతంలో టీడీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు మధ్య తేడాలను వివరిస్తూ... సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పాలనపై, సంక్షేమ పథకాలు అందుతున్న తీరుపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. గృహయజమాని అనుమతితో ఇంటికి జగనన్న స్టిక్కర్ అతికించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనందపార్థసారధి, వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగుచంద్ర, సింగిల్‌విండో డైరెక్టర్ వీరప్రతాప్, ఆర్‌బీకే చైర్మన్ శివారెడ్డి, కన్వీనర్లు బాబ్‌జాన్, విజయ్‌కుమార్, చంద్రకళ, జింకాబాలు, రాయల్‌మురళీ, సూరి, కవిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి ఆశాజ్యోతి

కలకడ : ప్రతి ఇంటి ఆశాజ్యోతిగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని మండల ఉపాధ్యక్షులు ఈశ్వర్‌నాయుడు, సింగిల్‌విండో అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఎనుగొండపాళ్యం, బాలయ్యగారిపల్లె పంచాయతీలలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చురుగ్గా చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి వద్దకు వెళ్లి సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరించారు. గత ప్రభుత్వానికి, జగనన్న ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసం ప్రజలు గమనించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి పట్టం కట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అమ్ములు, ఎంపీటీసీ స్వాతి, వైఎస్సార్‌సీపీ నాయకులు గణపతిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, సుబ్బయ్యనాయుడు, కొండారెడ్డి, రామలింగారెడ్డి, రెడ్డెయ్య, అబూబకర్ భాస్కర్, నాగేంద్ర, దావూద్, రెడ్డిఖాన్, దామోదర్, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.



కేవీపల్లె : జిల్లేళ్లమందలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో నాయకులు



కలకడ : ఎనుగొండపాళ్యంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న మండల ఉపాధ్యక్షులు


కేవీపల్లె : మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటా పర్యటించి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు తెలియజేశారు. సమస్యలను తెలుసుకుని నమోదు చేసి అధికారులతో సంప్రదించి, ఎమ్మెల్యే, ఎంపీల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ మోహన్‌రాజ, ఆయా పంచాయతీల సచివాలయ కన్వీనర్‌లు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాష్‌రెడ్డి, వెంకట్రమణ, ఆర్‌వీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షబ్-ఏ-ఖదర్



విద్యుత్ అలంకరణలో మదనపల్లెలోని జామియా మసీదు

మదనపల్లె సిటీ : పవిత్ర రంజాన్ మాసంలోని 27వ రాత్రిని పురస్కరించుకుని షబ్-ఏ-ఖదర్ పండుగను జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. మదనపల్లె పట్టణంలోని జామియా మసీదులతోపాటు పలు మసీదులు, ఖబ్రస్థాన్‌లను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఇందులో భాగంగా 28 రోజులుగా పఠిస్తూ వచ్చిన దివ్య ఖురాన్‌ను అన్ని మసీదుల్లోనూ పూర్తి చేశారు. స్థానిక సల్మాన్‌పార్సీ మసీదులో ప్రభుత్వ సర్‌ఖాజీ హాఫీజ్ ఇక్బాల్‌అహ్మద్ ధార్మికోపన్యాసం చేశారు. ఇస్లాంలో రంజాన్ మాసానికి మరీ ముఖ్యంగా షబ్-ఏ-ఖదర్‌కు ఉన్నత ప్రాముఖ్యతను వివరించారు. సోదరభావంతో ఐక్యంగా ఉండాలని సూచించారు. ఈ మాసంలో ప్రతి ముస్లిం విధిగా దానధర్మాలు చేయాలని తెలిపారు. ఇస్లాంలో ప్రార్థనలకు ఎంత ప్రాముఖ్యత ఉందో ధాన,ధర్మాలకు కూడా అంతే ప్రాధాన్యం ఉందన్నారు. ఫిత్రా,జకాత్ రూపంలో ధానధర్మాలు చేసి పేదలు కూడా పండుగ సంతోషంగా జరుపుకునేలా చూడాలని సూచించారు. అనంతరం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తర్వాత ఖబ్రస్థాన్‌కు వెళ్లి పూర్వీకుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



ధార్మికోపన్యాసం చేస్తున్న మత గురువులు